

# నాడు వెలుగులు.. నేడు చీకట్లు..



## కేసీఆర్ హయాంలో నిరంతర కరెంటు | కాంగ్రెస్ ప్రభుత్వంలో తీవ్ర విద్యుత్ సమస్య

- రోజు 12 నుంచి 14 గంటలు మాత్రమే సరఫరా
- గాలి వీచినా, చినుకు కురిసినా అంధకారమే..
- కోతలను నిరసిస్తూ సబ్ స్టేషన్ల ముట్టడి
- పంటలకు పొంచి ఉన్న పెను ప్రమాదం

ఆదిలాబాద్, జూన్ 19(నమస్తే తెలంగాణ) : కేసీఆర్ హయాంలో.. భారీ వర్షాలకు తట్టుకుని నిలబడిన విద్యుత్ వ్యవస్థ. బలమైన గాలులు వీచినా తెగిపడని కరెంటు లైన్లు. పెట్టని కోటలా నిటారుగా స్తంభాలు. ధ్రుడంగా ట్రాన్స్‌ఫార్మర్లు. లో ఓల్టేజీ, హై ఓల్టేజీ లేని కరెంటు. ఒక్కోరోజు పది సెంటీమీటర్ల వర్షం కురిసినా.. అంతరాయం లేని మెరుగైన, నాణ్యమైన సరఫరా. ఎక్కడ ఏ చిన్న అంతరాయం కలిగినా నిమిషాల్లో సరిచేసే అధికారులు. అన్ని కలగలిపి నిరంతరం కరెంటును సరఫరా చేశాడు. దండగన్న ఎవుసాన్ని పండుగలా మార్చాడు. పుట్లకొద్దీ వడ్లు పండించి, రైతుల మోముల్లో ఆనందం నింపాడు. కానీ.. ఆరున్నర నెలల కాంగ్రెస్ పాలనలో.. గాలిదుమారం లేచినా, చినుకుపడినా చిటుక్కున కరెంటు తీసేస్తున్నారు. విద్యుత్ తీగలు తెగిపడినా, స్తంభాలు నేలకొరిగినా, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయినా, తీగలు వేలాడుతున్నా విద్యుత్ అధికారులకు ఫోన్ చేసినా స్పందించడం లేదు. లో ఓల్టేజీ.. లేదంటే హై ఓల్టేజీతో ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోతున్నాయి. కరెంటు అంతరాయానికి ఊళ్లకు ఊళ్లు నాలుగైదు రోజులు గాడాంధకారంలో మగ్గుతున్నాయి. పట్టణాల్లోనే గంటల తరబడి కరెంటు తీసేస్తున్నారు. పంటలకు నీరందించేంత సేపు కరెంటు ఉండకపోవడంతో రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సబ్‌స్టేషన్లను ముట్టడిస్తున్నారు. విద్యుత్ అధికారులను నిలదీస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కడిగిపారేస్తున్నారు. వ్యవసాయం, గృహ, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా సరిగ్గా ఉండడం లేదు. వ్యవసాయానికి అందించే త్రీఫేజ్ కరెంటు 12 నుంచి 14 గంటలు మాత్రమే ఉంటున్నది. వానకాలం ప్రారంభంకావడంతో వ్యవసాయానికి విద్యుత్ అవసరం ఉంటుంది. కరెంటు మోటార్ల ద్వారా పంటలకు నీరు అందించుకుంటారు. సీజన్ ప్రారంభం కాగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు ఇప్పటికే విత్తనాలు నాటారు. వర్షాలు పడకపోవడంతో స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. యాసంగిలో కరెంటు కోతల కారణంగా రైతులు పంటలను నష్టపోవాల్సి వస్తున్నది. వానకాలం విద్యుత్ సరఫరాపై రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయానికి కరెంటు అవసరం లేని సమయంలో రోజు 12 నుంచి 14 గంటలు మాత్రమే కరెంటు వస్తుందని, పంటలకు నీరు అవసరమైన సమయంలో కరెంటు లేకపోతే నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులకు మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేయాలని కోరుతున్నారు. చివరకు తెలంగాణ రాష్ట్రాన్ని రెప్పపాటు కరెంటుపోని రాష్ట్రంగా మార్చిన కేసీఆర్‌పై ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిందలు వేయడంపై రైతాంగం మండిపడుతున్నారు. ప్రజలు, రైతుల జీవితాల్లో వెలుగులు పంచిన నాయకుడిపై అభాండాలు మోపడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయనే లేకుంటే వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఎక్కడిదని ప్రశ్నిస్తున్నారు.

## 10 నెలలుగా ఎక్కడి ట్రాన్స్‌ఫార్మర్ అక్కడే..

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని భూర్నూర్‌లో గతేడాది ఆగస్టులో కురిసిన భారీ వర్షాల కారణంగా రైతుల చేలలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పడిపోయింది. అనంతరం ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగితీగను దొంగలు ఎత్తుకెళ్లిపోయారు. ఈ విషయంలో స్థాని క రైతులు విద్యుత్ అధికారులను సంప్రదిస్తే వారు పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ చేయించాలని సూచించారు. పోలీసులకు ఈ విషయాన్ని తెలియజేశారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కోసం విద్యుత్ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పని కావడం లేదు. యాసంగిలో ట్రాన్స్‌ఫార్మర్ లేక రైతులు సాగు చేయలేదు. దాదాపు 10 నెలలుగా కాలంగా పడి ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇప్పటికైనా మరమ్మతు చేయించాలని అన్నదాతలు కోరుతున్నారు.

## కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి..



పంటలకు నీరు అందించడానికి ఉపయోగపడే ట్రాన్స్‌ఫార్మర్ గతేడాది ఆగస్టులో కురిసిన భారీ వర్షాలతో పడిపోయింది. అందులో తీగను దొంగలు ఎత్తుకుపోయారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కోసం విద్యుత్ అధికారుల వద్దకు వెళ్తే పోలీస్ కంప్లయింట్ ఇవ్వమని చెబితే ఇచ్చాం. అయినా విద్యుత్ అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ పెట్టడం లేదు. 10 నెలల నుంచి వారి చుట్టూ తిరుగుతున్నా స్పందన లేదు. ట్రాన్స్‌ఫార్మర్ లేకపోతే పంటలకు నీళ్లు అందించలేని పరిస్థితి ఉంది. అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.

**- భరత్, రైతు, భూర్నూర్, ఆదిలాబాద్ రూరల్ మండలం**

## కేసీఆర్‌కు సాధ్యమైంది.. కాంగ్రెసోళ్లకు ఎందుకు కాదు..?



కడెం, జూన్ 19 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఇబ్బందులు ఎలా ఉండేవో అలాంటి పరిస్థితులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి మన రాష్ట్రంలోకి తీసుకొచ్చింది. 2014కు ముందు రాష్ట్రంలో వ్యవసాయం చేయడం ఎంతో ఇబ్బందిగా ఉండేది. రాత్రి సమయాల్లో మాత్రమే సాగుకు కరెంట్ ఇచ్చేవాళ్లు, కేవలం రాత్రి మాత్రమే 9 గంటల సరఫరా చేసేవారు. చేను వద్ద కునుకు తీస్తేనే మడి పారేది. చాలా మంది రైతులు పాము కాటుకు, ఇతర విష పురుగులకు బలైపోయారు. వ్యవసాయాన్ని విడిచిపెట్టే పరిస్థితులను తీసుకొచ్చింది. 2014లో ఏర్పాటైన తెలంగాణ ప్రభుత్వం కేసీఆర్ అధ్యక్షతన ప్రత్యేక రాష్ట్రం కోసం కరెంటు కోతలు లేని రాష్ట్రంగా మారింది. రాష్ట్రానికి అవసరమైన కరెంట్ ఉత్పత్తితోపాటు, 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించడం, పగటి పూట ఇబ్బందులు లేని కరెంట్‌ను రైతులకు నాణ్యంగా అందించారు. ఫలితంగా వలస వెళ్లిన రైతులు తిరిగి స్వగ్రామాలకు వచ్చి వ్యవసాయాన్ని పండుగలా చేసుకున్నారు. ఈ తరుణంలో రైతులకు పెట్టుబడుల సహాయంతోపాటు, అనేక సౌకర్యాలు కల్పించిన ఘనత కేసీఆర్‌ది. కానీ.. నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ఆరున్నర నెలల్లోనే విద్యుత్ ఇబ్బందులు తీసుకురావడంతోపాటు, రాష్ట్రంలో డిమాండ్‌కు సరిపడా విద్యుత్ సరఫరా లేకపోవడంతో త్రీఫేజ్ సరఫరా వేళల్లో కోతలు విధిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వానికి సాధ్యమైన కరెంటు.. కాంగ్రెస్ సర్కారుకు ఎందుకు కావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం నిత్యం రైతులను ఇబ్బందులు పెట్టడమే తప్పా.. రైతుల పక్షాన ఏనాడు నిలవలేదు. పదేళ్ల కాలం పాటు రైతులను ఎలా ఆదుకోవాలని తపన పడిన కేసీఆర్‌పై, ఆయన సరఫరా చేసిన విధానంపై కాంగ్రెస్ మాట్లాడడం అర్థరహితం.

**-సమ్మెట రాజన్న, రైతు, పెద్దూర్, కడెం.**

## దుష్ప్రచారం సరికాదు..



భైంసా, జూన్ 19 : నిరంతరాయంగా కరెంటు సరఫరా చేస్తున్నామని చెబుతున్న కాంగ్రెసోళ్ల మాటలకు, చేతలకు పొంతన ఉండడం లేదు. వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరా చేస్తున్నామని వట్టి మాటలు చెబుతున్నారు. రాత్రి వేళల్లో గంటల తరబడి కరెంటు లేక ఇబ్బంది పడుతున్నాం. చిన్నపాటి వర్షం కురిసిన, గాలివీచినా కరెంటు కట్ చేస్తున్నారు. పగలు ఎండ, రాత్రి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాం. వర్షం సాకుతో గంటల తరబడి కరెంటు తీసేస్తున్నారు. కేసీఆర్ హయాంలో రెప్పపాటు కూడా కరెంటు పోకుండా ఉండేది. ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటు తీసుకరావడంపై కాంగ్రెసోళ్లు దుష్ప్రచారం చేస్తున్నారు. అప్పటి పరిస్థితుల్లో రైతులను రక్షించుకోవడానికి, పరిశ్రమలను కాపాడుకోవడానికి కరెంటు కొన్నారు. లేకపోతే ఇండ్లకు, పరిశ్రమలకు, వ్యవసాయానికి ఇబ్బంది పడేవాళ్లం.

**-సాయినాథ్, రైతు, భైంసా.**

## కేసీఆర్‌ను అంటే పుట్టగతులుండవ్..



తానూర్, జూన్ 19 : తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు కరెంటు ఎప్పుడు వచ్చేదో.. ఎప్పుడు పోయేదో తెలిసేది కాదు. కరెంట్ సమయానికి రాక పంటలు సరిగా పండేవి కావు. అప్పుడు బోర్లు, బావుల వద్ద రాత్రంతా చేల వద్దే ఉండే వాళ్లం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, కేసీఆర్ సీఎం అయ్యాక తొలిసారి తీసుకున్న మంచి నిర్ణయం 24 గంటల కరెంటు ఇవ్వడంతో కష్టాలు తీరాయి. నాణ్యమైన కరెంటు ఇవ్వడం వల్ల మోటార్లు కాలిపోలేదు. కరెంటు ఉచితంగా ఇవ్వడంతో బోర్లు వేసుకుని ఉన్న భూమినంతటికి సాగులోకి తెచ్చుకున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కరెంటు కష్టాలు మొదలయ్యాయి. కరెంటు కోతలతో రైతుల బతుకులు ఆగమయ్యాయి. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌పైన కాంగ్రెస్ నాయకులు కరెంటుపై లేని పోని ఆరోపనలు చేస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. అన్నవారికి పుట్టగతులుండవు.

**- పంగి గంగారెడ్డి, రైతు, తానూర్.**

## జేఎన్టీయూ కళాశాలపై నిర్లక్ష్యం వీడాలి..




ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

ఎదులాపురం, జూన్ 19 : కాంగ్రెస్ ప్రభుత్వం జేఎన్టీయూ కళాశాలపై నిర్లక్ష్యం వీడాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు బుట్టి శివకుమార్ అన్నారు. ఆరు నెలలు గడుస్తున్నా జేఎన్టీయూ కళాశాలపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించడంపై నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగానే బుధవారం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు ర్యాలీగా బయలుదేరి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి జోగు రామన్న కృషితో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేసుకున్నామన్నారు. అలాగే ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు అనుమతులు లభించినా.. ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణ మొదలు పెట్టకపోవడం సిగ్గుచేటన్నారు. రూ.40 కోట్లతో ఐటీ టవర్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందని అన్నారు. ఇకనైన కాంగ్రెస్ ప్రభుత్వం జేఎన్టీయూ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో విద్యార్థుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పవన్‌కుమార్ నాయక్, విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షుడు వాగ్మారే ప్రశాంత్, అబ్దుల్లా, మోసిన్, సోయబ్ ఉన్నారు.

## నులి పురుగుల నివారణే ధ్యేయం

- నేటి నుంచి మాత్రల పంపిణీ
- నిర్మల్ జిల్లాలో 1.92 లక్షల మంది పిల్లల గుర్తింపు



నులి పురుగుల నివారణ బ్రోచర్

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 19 : నులి పురుగుల వ్యాప్తిని అరికట్టి, పిల్లల ఆరోగ్యాన్ని కాపాడడానికి ప్రభుత్వం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నది. నేటి (గురువారం) నుంచి ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేయడానికి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. నిర్మల్ జిల్లాలో 1-19 ఏళ్లలోపు 1.92 లక్షల మంది పిల్లలకు మాత్రలను పంపిణీ చేయనున్నారు. ఇందు లో బడికి రాని పిల్లలను కూడా గుర్తించనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో మాత్రలు వేసేందుకు సిద్ధం చేశామని నిర్మల్ జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ తెలిపారు.

లక్షణాలు : రక్తహీనత, పోషకాలలోపం, ఆకలి లేకపోవుట, బలహీనత, ఆందోళన, కడుపు నొప్పి, వికారం, నీళ్ల విరేచనాలు, బరువు తగ్గడం.

తీసుకోవాల్సిన చర్యలు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పరిశుభ్రమైన ఆహారం, నీరు తీసుకోవాలి. ఆహార పదార్థాలపై మూతలు పెట్టాలి. ఆరు బయటకు వెళ్లినపుడు పాదరక్షలు ధరించాలి. భోజనం చేసే ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయవద్దు. తినే ముందు పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడుక్కోవాలి.

# 'సాగు'కు సిద్ధం

- నైరుతి ఆగమనంతో కురుస్తున్న వర్షాలు
- వారం రోజులుగా నిర్మల్ జిల్లాలో మోస్తరు వానలు
- అందుబాటులో సరిపడా విత్తనాలు
- వానకాలంలో 4.33 లక్షల ఎకరాల్లో పంటలు
- 70-80 మిల్లీమీటర్ల వర్షపాతం దాటితేనే విత్తనాలు నాటాలి : అధికారులు



కుభీర్ మండలంలో దుక్కి దున్ని సాగుకు సిద్ధం చేస్తున్న రైతన్న

నిర్మల్, జూన్ 19(నమస్తే తెలంగాణ) : నైరుతి రుతుపవనాల ఆగమనంతో నిర్మల్ జిల్లాలో తొలకరి వర్షం పలకరించింది. వారం, పది రోజులుగా ఓ మోస్తరు వరాలు కురుస్తున్నాయి. ఇప్పటికే దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు వర్షం కోసం ఎదురు చూస్తున్న అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇప్పుడే విత్తనాలను నాటొద్దని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. భూమిలో సరిపడా పదను ఉంటేనే విత్తనాలు నాటాలని, లేదంటే మొలకెత్తిన విత్తనాలు ఎండిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా 70 నుంచి 80 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతనే విత్తనాలు వేయాలని, అప్పుడే నాటిన ప్రతి విత్తనం మొలకెత్తే అవకాశం ఉందని అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 65.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. గతేడాది ఇదే సమయానికి 11.1 మి.మీ. వర్షం కురిసింది. ఈ ఏడాది జూన్ 19 నాటికి జిల్లా సాధారణ వర్షపాతం 106.4 మి.మీ. కాగా, ప్రస్తుతం 38 శాతం లోటు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు లోకేశ్వరం మండలంలో 24 శాతం అధికంగా 106 మి.మీ. వర్షపాతం నమోదైంది. అలాగే అత్యధికంగా బాసర మండలంలో 103 మి.మీ., సారంగాపూర్ మండలంలో 93.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది.

### 4.33 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లావ్యాప్తంగా 4,33,300 ఎకరాల్లో పత్తి, వరి, మక్క, సోయా, పప్పు దినుసులు పండించేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇందులో పత్తి 1.68 లక్షలు, వరి 1,35 లక్షలు, సోయా ఒక లక్ష, మక్క 18 వేలు, కందులు 10 వేలు, మినుములు, పెసర్లు, ఇతర పంటలు 1000 ఎకరాల్లో సాగవుతాయని ప్రణాళికలు రూపొందించారు. ఈసారి వరిని తగ్గించి, పత్తితోపాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల వైపు రైతులను ప్రోత్సహించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 7 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతున్నది.

### 66 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు

జిల్లా వ్యాప్తంగా ఆయా డీలర్ల వద్ద ప్రస్తుతం 1.19 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో వరి 23,900 క్వింటాళ్లు, సోయా 25వేల క్వింటాళ్లు, మక్క 1,440 క్వింటాళ్ల విత్తనాలు మార్కెట్‌లో ఉన్నాయి. ఇప్పటికే జిల్లా రైతులు 2.60 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లను కొనుగోలు చేశారు. లోకేశ్వరం, బాసర, సారంగాపూర్, కుభీర్, తానూర్, భైంసా మండలాల్లో తొలకరి వర్షానికే కొంత మంది పత్తి విత్తనాలు నాటారు. కాగా.. ఎరువులు 66 వేల మెట్రిక్ టన్నులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేయగా, ప్రస్తుతం 27,400 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి. యూరియా 36వేల మెట్రిక్ టన్నులకు 15వేలు, కాంప్లెక్స్ ఎరువులు 18వేల మెట్రిక్ టన్నులకు 8 వేలు, డీఏపీ 12 వేల మెట్రిక్ టన్నులకు 4,400 అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అవసరాన్ని బట్టి మిగతా ఎరువులను కూడా తెప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



పత్తి విత్తనాలు నాటేందుకు ట్రాక్టర్‌తో భూమిని చదును చేస్తున్న రైతులు

## రీ యింబర్స్‌మెంట్ విడుదల చేయాలి..



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

జైనథ్, జూన్ 19 : కళాశాలలకు రావాల్సిన రీ యింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు మూడేండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్‌లో నిర్వహించిన శాంతి దీక్షలో ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ కళాశాల యాజమాన్యాలు పాల్గొన్నాయి. రీ యింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో డిగ్రీ కళాశాలు నడపడం దుర్భరంగా ఉందన్నారు. ఇప్పటికే చాలా కళాశాలలో మూత పడ్డాయని పేర్కొన్నారు. అధ్యాపకుల వేతనాలు ఇవ్వడం సమస్యగా మారిందన్నారు. వెంటనే రీ యింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తరపున ప్రభాకర్ రెడ్డి, సురేందర్, వరప్రసాద్‌రావు, కార్తీక్, రాజ్‌కిరణ్‌రెడ్డి, అనంత్ దేశ్ పాండే, సాజీద్, వికాస్ పాల్గొన్నారు.

## మున్సిపల్ వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం



కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం కాపీని అందిస్తున్న కౌన్సిలర్లు

- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జహీర్ రంజానీ
- సొంత పార్టీ కౌన్సిలర్ల పాత్ర కీలకం
- కలెక్టర్‌కు తీర్మానం అందజేసిన కౌన్సిలర్లు

ఆదిలాబాద్, జూన్ 19(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌పై వివిధ పార్టీలకు చెందిన కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించారు. ఈ మేరకు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 34 మంది కౌన్సిలర్లతో కూడిన తీర్మానం లేఖను బుధవారం కలెక్టర్‌కు అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో 49 వార్డులు ఉండగా బీఆర్ఎస్ 26, బీజేపీ 9, కాంగ్రెస్ 9, ఎంఐఎం 3, అసంతృప్తి కాంగ్రెస్ కౌన్సిలర్లు 2 ఉన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా బీఆర్ఎస్‌కు చెందిన జోగు ప్రేమేందర్ ఉన్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన జహీర్ రంజానీ వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆయన బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్ అవిశ్వాసానికి ముందుకు రాగా బీఆర్ఎస్, బీజేపీ, కౌన్సిలర్లు ఆయనకు మద్దతు ఇస్తున్నట్లు తెలుస్తుంది. జహీర్ రంజానీపై సొంత పార్టీకి చెందిన కౌన్సిలర్ అవిశ్వాశాన్ని ప్రకటించడం చర్చనీయంశంగా మారింది. మెజార్టీ సభ్యులు అవిశ్వాసానికి మద్దతుగా ఉండడంతో ఆయన పదవి ఉంటుందో ఊడుతుందో తెలియని పరిస్థితి ఉంది. కౌన్సిలర్లు ఇచ్చిన తీర్మానం లేఖపై స్పందించిన కలెక్టర్ తాము ఓ సమావేశం తేదీని ప్రకటించి, అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపినట్లు కౌన్సిలర్లు చెప్పారు.